www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 సెప్టెంబరు 2025

5

పశ్చిమ గోదావరి

వైఎన్‌లో ఎన్‌సిసి ప్రవేశాల ప్రక్రియ

ఎంపికైన క్యాడెట్లు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక శ్రీవైఎన్ కళాశాలలో నేవల్ యూనిట్ వారి ఎన్‌సిసి ఎన్‌రోల్‌మెంట్ 2025వ సంవత్సరానికి గాను ప్రవేశాల ప్రక్రియ నిర్వహించారు. లెఫ్టినెంట్ ఎస్.రౌత్రాయ్ అధ్యక్షతన విద్యార్థులకు శరీర దారుఢ్య పరీక్షలు, రాత పరీక్షలు, ఆరోగ్య పరీక్ష, ముఖాముఖి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా 20 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని లెఫ్ట్ నెంట్ ఎస్.రౌత్రాయ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.కనకారావు, డీన్, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ గంధం రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎఎన్‌ఒ సబ్ లెఫ్‌నెంట్ జి.సునీత, 7(ఎ) నేవల్ యూనిట్ పిఐ స్టాఫ్ నిర్వహించారు.

కౌలు రైతులకు దక్కని

అన్నదాత సుఖీభవ



- ఖరీఫ్ సాగు చివరి దశకు చేరినా అందని పెట్టుబడి సాయం
- జిల్లా సాగులో 80 శాతం కౌలురైతుల చేతుల్లోనే
- ఇప్పటికీ పూర్తికాని కౌలుకార్డుల జారీ ప్రక్రియ
- రెండు జిల్లాల్లో లక్షా 80 వేల కౌలుకార్డుల జారీ లక్ష్యం
- అప్పుల సాగుతో అన్నదాత అవస్థలు
- కౌలుచట్టంపైనా కూటమి సర్కార్ దొంగాట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు చివరి దశకు చేరింది. పొలాలు పలుచోట్ల పక్వానికి, కొన్నిచోట్ల పొట్టదశకు చేరుకున్నాయి. అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకూ కౌలురైతులకు మాత్రం ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందించే 'అన్నదాత సుఖీభవ' సొమ్ము మాత్రం అందని దుస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయసాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. వ్యవసాయ సాగులో కౌలురైతులదే కీలక పాత్ర అని అందరికీ తెలిసిందే. అయినప్పటికీ కూటమి సర్కార్ కౌలురైతుల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దసంఖ్యలో కౌలురైతులు ఉన్నప్పటికీ ప్రస్తుత ఏడాదిలో ఏలూరు జిల్లాలో 75 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా ఐదు వేల మందికి కౌలుకార్డులు జారీ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. రెండు జిల్లాల్లో 20 వేల వరకూ కౌలుకార్డులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇంకా 50 వేల మందికిపైగా రైతులకు కౌలుకార్డులు ఇవ్వాల్సి ఉంది. అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని చెబుతున్నా.. అవుతుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అన్నదాత సుఖీభవ సొమ్ము ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. కౌలురైతులకు పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి సాయం అనేది సాగు ఆరంభంలో ఇవ్వాలి. ఖరీఫ్ సాగు చివరి దశకు చేరుతున్నా అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం మాత్రం కౌలురైతులకు అందలేదు. భూయజమానులకు మాత్రం ఆగస్టు 2వ తేదీన ఏలూరు జిల్లాలో లక్షా మూడు వేల మందికి, పశ్చిమలో లక్షా 60 వేల మంది మొదటి విడత సొమ్ము ప్రభుత్వం జమ చేసింది. సాగులో కీలకమైన కౌలు రైతులకు మాత్రం అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలవుతోంది. ఇప్పటి వరకూ కౌలురైతులకు ఏ ఒక్క సాయమూ లేదు. కౌలురైతులకు బ్యాంకు రుణాలు సైతం సక్రమంగా ఇవ్వని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో మొత్తంగా చూసినా కౌలురైతులకు ఇచ్చిన రుణాలు రూ.వంద కోట్లు దాటని పరిస్థితి. ఇచ్చిన రుణాలు సైతం రైతుమిత్ర గ్రూపుల కింద ఇచ్చినవే. కౌలుకార్డుల ద్వారా ఇచ్చిన రుణాలు దాదాపు లేవనే చెప్పొచ్చు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా అనే సందేహాలు అలుముకున్నాయి. ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కౌలు చట్టంపై దొంగాట

తాము అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన కౌలుచట్టాన్ని మార్పు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. వైసిపి తెచ్చిన చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుదారులకు కౌలుకార్డులు ఇవ్వాలని నిబంధన పెట్టారు. దీంతో భూయజమానులు కౌలుదారులకు కార్డులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో కౌలురైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. సాగుచేసిన భూయజమానులే ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం, బీమా పరిహారం వంటివి తీసుకుంటున్నారు. దీంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న పరిస్థితి ఉంది. తాము అధికారంలోకి వస్తే కౌలుచట్టంలో మార్పులు తెచ్చి కౌలురైతులను ఆదుకుంటామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు సైతం నిర్వహించారు. తర్వాత పూర్తిగా పక్కన పెట్టేశారు. దీని వెనుక కుట్ర ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కౌలుచట్టంపై ప్రభుత్వం దొంగాట ఆడుతుందనే చర్చ కౌలురైతుల్లో నెలకొంది. కౌలురైతులకు కూటమి సర్కార్ మోసగించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేదల ఇళ్ల కూల్చివేత దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామంలో పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. రైతులకోసం వారి నుంచి సుమారు రూ.కోటిన్నర వసూలు చేసి పేదల ఇళ్లను కూల్చారని ఆరోపించారు. బొండాడ గ్రామంలో కూల్చిన పేదల ఇళ్లను, ఖాళీగా ఉన్న ఇరిగేషన్ భూములను ఆయన గురువారం పరిశీలించారు. బాధితులతో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు ఎంఎల్ఎగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలో పేదలపై యుద్ధం పేరుతో ఇల్లు కూల్చివేస్తున్నారన్నారు. కూల్చివేయడం అభివృద్ధి కాదని, ప్రజలు హర్షించరని అన్నారు. బొండాడలో సుమారు 70 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించి 25 రోజులైనా ఇప్పటికీ వారికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పేదల ఇళ్లను తొలగించడం కోసం రైతుల నుంచి వసూలు చేసిన రూ.కోటిన్నర సొమ్ము పేదల ఇళ్ల నిర్మాణానికి వెచ్చించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన ఆందోళన చేపడతామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఆర్ఎస్ నెంబర్.71, 72లో కాలువ పోరంబోకు భూమిలో నివాసం ఉంటున్న ఆరు ఇళ్లను తొలగించడం కోసం రైతుల నుంచి కోటిన్నర పైగానే వసూలు చేయడం దుర్మార్గమన్నారు.

ఏషియన్ పోటీలకు హేమంత్‌శ్రీ

ప్రజాశక్తి - తణుకు

చైనాలో అక్టోబరు 21 నుండి 26 వరకు జరిగే జూనియర్ ఏషియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు స్థానిక చిట్టూరి సుబ్బారావు గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారుడు సమ్మెట్ల హేమంత్‌శ్రీ ఎంపికైనట్లు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టూరి సత్యఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ మెంటే వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు హర్యానాలోని పంచకుల నగరంలో జరిగిన ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీల్లో హేమంత్‌శ్రీ విజేతగా నిలిచి భారత జూనియర్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు మాట్లాడుతూ క్రీడాకారుడు హేమంత్‌శ్రీని అభినందిస్తూ త్వరలో చైనాలో జరిగే ఏషియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి స్వర్ణపతకం సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సభలో వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, అకాడమీ కోచ్ సమ్మెట్ల సతీష్‌బాబు, యు.సుదర్శన్, పిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆనందం అని, ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్' స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో పెద్ద పోస్టాఫీస్ వద్ద ఎడ్వర్ట్ ట్యాంక్ చుట్టూ మున్సిపాల్టీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మెప్మా, మహిళలు చేపట్టిన శ్రమదానం చేశారు. కలెక్టర్ కొడవలి చేతబట్టి చెత్తను తొలగించి పరిశుభ్రతపై ప్రజలలో చైతన్యం కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమన్నారు. మన పరిసరాల పరిశుభ్రతతో సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయంతో రోటరీ క్లబ్ అధ్యక్షులు కిషోర్, పెద్దలు సుబ్బారావు, జూపూడి సంజయ్య సారథ్యంలో రూ.లక్షలు వెచ్చించి ట్యాంకు చుట్టూ పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు వాక్ చేయడానికి అనువుగా అభివృద్ధి చేశామన్నారు. బోట్ షికారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కనీసం రోజుకో గంటపాటైనా సమాజానికి సేవ చేయడం ప్రతిఒక్కరికీ స్ఫూర్తి కావాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తామన్నారు. అయినప్పటికీ కొంతమంది చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా, కాల్వల్లోను, రోడ్ల పక్కన వేసేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ సోమశేఖర్, సిఎంఒ శివప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షులు గుండు కిషోర్, ట్రెజరర్ బొండా వెంకట సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ నడిపల్లి నరసింహారావు, డైరెక్టర్లు మడిపల్లి శేఖర్, ఎస్‌విఆర్‌సి.జయవర్మ, షేక్ బాబాజీ సాహెబ్, సభ్యులు గుండు గిరి, సుధీర్, ప్రజలు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి: కలెక్టర్

శ్రమదానం చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఔత్సాహికవేత్తలు నూతన పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని, మౌలిక వసతుల కల్పన తమ బాధ్యతని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో పరిశ్రమలు, సేవా రంగాల విస్తరణ ద్వారా జిడిపి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నించేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి, ఇన్వెస్టర్లతో ముఖాముఖి సమావేశం నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపుతున్న ఔత్సాహికవేత్తల అభిప్రాయాలను, ప్రస్తుతం కొనసాగుతున్న పరిశ్రమల వివరాలు, కొత్తగా ప్రారంభించబోయే పరిశ్రమలు, వ్యాపారాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా విద్యుత్ లైన్లు, డ్రెయినేజీ వ్యవస్థ, భూమి తదితర అంశాలను సమావేశంలో ప్రస్తావించగా, విద్యుత్ లైన్ల ఏర్పాటును రానున్న 40 రోజుల్లో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యూనో ఫీడ్స్, పరివర్తన ఇంజినీరింగ్, మరనాత ఇండస్ట్రీస్, వెంకటరమణ స్టీల్ ఫ్యాబ్రికేషన్ ఇండస్ట్రీ, హరిత సహస్ర రిసార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, హర్షిత్ బీచ్ రిసార్ట్స్, వి కన్వెన్షన్ యాజమాన్యాలతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాల్లో సంతృప్తికరమైన అభివృద్ధి ఉన్నప్పటికీ, పరిశ్రమలు, సేవా రంగాల్లో ప్రగతి వెనుకంజలో ఉందన్నారు. ఎక్కువ ఆర్థిక పరిపుష్టిత కలిగిన జిల్లాగా పేరు గడించినప్పటికీ స్థిరమైన జిడిపి సాధించలేకపోతున్నామన్నారు. ఆగస్టు 28 నుండి ఇప్పటి వరకు వివిధ శాఖల అనుమతుల కోసం 1,576 దరఖాస్తులు రాగా 1,503 దరఖాస్తులను ఆమోదించామని, మరో 73 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. పిఎంఇజిపి పథకం కింద యూనిట్ల స్థాపన మంజూరుకు 141 దరఖాస్తులను బ్యాంకులకు పంపామని, 191 యూనిట్లు స్థాపించారని, బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న 111 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా టూరిజం శాఖాధికారి ఎవి.అప్పారావు, డిపిఒ ఎం.రామ్‌నాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ స్వాతి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఇ జి.వెంకటరమణ, ఫిషరీస్ ఎడి ఎల్ఎన్.రాజు, ఎలక్ట్రికల్ ఇఇ వెంకటేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి అరుణకుమారి పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థుల నరకయాతన..!

- మీటింగ్ అయ్యాక గంటల తరబడి కానరాని బస్సులు
- రోడ్డుపైనే అభ్యర్థుల నిరీక్షణ
- అర్ధరాత్రికిగాని ఏలూరు చేరని బస్సులు
- పట్టించుకునే నాథుడు లేక నానావస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నియామక పత్రాలు అందుకునేందుకు అమరావతికి వెళ్లిన డిఎస్‌సి అభ్యర్థులు గురువారం నరకయాతన అనుభవించారు. ఉదయం ఎనిమిది గంటలకు ఏలూరు నుంచి బస్సుల్లో బయలుదేరిన అభ్యర్థులు అర్ధరాత్రికిగాని ఏలూరు చేరుకోని పరిస్థితి ఏర్పడింది. సరైన ఆహారం లేక, పట్టించుకునే వారు కరువై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా సిఎంతో సమావేశం ముగిసిన తర్వాత అభ్యర్థుల గురించి పట్టించుకునే వారే లేకపోయారు. బస్సులు ఎక్కడ పెట్టారో ఏఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది. అక్కడే రోడ్లపై రాత్రి 9 గంటల వరకు వేచిచూస్తూనే ఉన్నారు. ఒకపక్క ఆకలి, మరోపక్క ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి అందరినీ ఆందోళనకు గురి చేసింది. ముఖ్యంగా మహిళా అభ్యర్థుల అవస్థలు వర్ణనాతీతం. బస్సులకు ఇన్‌ఛార్జీలుగా నియమించిన అధికారులకు సైతం బస్సులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. బస్సు సిబ్బంది ఫోన్లు ఎత్తకపోవడంతో బస్సులు వస్తాయో, రావో అనే ఆందోళన ఏర్పడింది. జిల్లా నుంచి దాదాపు 1100 మందికి పైగా అభ్యర్థులు, వారి కూడా ఒక్కొక్కరు చొప్పున కుటుంబీకులు సుమారు రెండు వేల మందికిపైగా వెళ్లారు. వీరంతా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి ఏలూరు వచ్చినవారే. సిఎం సభ దాదాపు ఐదు గంటలకు ముగిసినప్పటికీ రాత్రి తొమ్మిది, పది గంటల వరకు బస్సులు మాత్రం రాలేదు. దీంతో అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లా నుంచి వచ్చిన అధికారులు తమను సరిగా పట్టించుకోలేదనే అభిప్రాయం అందరిలోనూ నెలకొంది. దీంతో విద్యాశాఖ అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ముందు రోజు బుధవారం సైతం ఏలూరులో కేటాయించిన పది స్కూళ్లలోను సక్రమంగా ఏర్పాట్లు చేయని విషయం తెలిసిందే. గురువారం అమరావతి నుంచి ఇక్కడికి తీసుకురావడంలోనూ తీవ్ర నిర్లక్ష్య ధోరణి కనిపించింది. అర్ధరాత్రి ఏలూరు చేరుకున్న అభ్యర్థులు ఇళ్లకు వెళ్లేందుకు నరకయాతన అనుభవించారు. అధికారులకు సరైన ప్రణాళిక లేకపోవడం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందనే చర్చ అభ్యర్థుల్లో సాగింది.

ఆర్‌టిసి కార్మికులకు కనీస వేతనమివ్వాలి

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న తులసీరావు, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఆర్‌టిసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వాలని, పండగ సెలవులు అమలు చేయాలని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.తులసీరావు డిమాండ్ చేశారు. గురువారం భీమవరం ఆర్‌టిసి డిపో, బస్టాండ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆయన కలిసి కరపత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల్ని పర్మినెంట్ చేయలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయలసిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. స్వీపర్లు, పెయింటర్స్, మెకానిక్ వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టర్లు కనీస వేతనాలు అమలు చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమస్యల పరిష్కారానికి దశల వారీ ఆందోళన పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, యూనియన్ నాయకులు కె.సతీష్, బి.దుర్గ ప్రసాద్, జివి.రమణ, ఎంఎం.మూర్తి, కె.దిలీప్, డి.నాగమణి పాల్గొన్నారు.

విజయవాడ తరలిన డిఎస్‌సి అభ్యర్థులు

అక్టోబర్ మొదటి వారంలో అపాయింట్‌మెంట్ లెటర్లు

బస్సులో విజయవాడ వెళ్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి-2025లో జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులు గురువారం ఉదయం విజయవాడ తరలివెళ్లారు. వెలగపూడిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా వారంతా డిఎస్‌సికి ఎంపికైనట్లు లేఖలు అందుకున్నారు. ఏలూరు జిల్లాలో ఎంపికైన 1063 మందితోపాటు జిల్లా నుంచి ఇతర జోన్లకు ఎంపికైన 83 మంది కలిపి మొత్తం 1146 మంది బుధవారం సాయంత్రం ఏలూరు చేరుకుని వారికి కేటాయించిన కేంద్రాల్లో రాత్రి బస చేసి, గురువారం ఉదయం వారికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో వెలగపూడి వెళ్లారు. ప్రస్తుతం వెలగపూడి సభలో వారు డిఎస్‌సికి ఎంపికైనట్లు లేఖలు అందుకున్నారు. అక్టోబర్ మొదటి వారంలో వారందరికీ శిక్షణ ఇచ్చిన అనంతరం కౌన్సెలింగ్ ద్వారా వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించనున్నారు. కౌన్సెలింగ్ ఆన్‌లైన్ జరుగుతుందా లేదా ఆఫ్‌లైన్ జరుగుతుందా అన్నది ఇంకా తెలియాల్సిన అవసరం ఉంది.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - యలమంచిలి

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇచ్చి ఏడాదికి 200 పని దినాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికసంఘం 10వ మండల మహాసభ గురువారం మండలంలోని ఇలపకుర్రు గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు కొండేటి నాగేశ్వరావు సంఘ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు సీనియర్ నేత మాసవరపు సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాల కార్యకలాపాలను సమీక్షించి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, రెండు పూట్ల మాస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లోని రోడ్లు పక్కన, ఏటుగట్లు పక్కన ఉన్న కొబ్బరి చెట్లు వ్యవసాయ కార్మిక పేద కుటుంబాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు జార్జి వ్యవసాయ కార్మికులకు 50 సంవత్సరాలు పైబడిన వారికి ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని, దళిత ఓడలకు శ్మశాన భూములు కేటాయించాలని, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న కొబ్బరి చెట్లు పేదలకు పంచాలని తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ సభలో కెవిపిఎస్ నాయకులు కానేటి బాలరాజు, సిఐటియు నాయకులు దేవ సుధాకర్, కౌలు రైతు సంఘం నాయకులు గూడూరు ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు రామచంద్రారావు మాట్లాడారు. అనంతరం 12 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా మాసవరపు సుబ్బారావు, ఎడ్ల మోహన్ రావు, ఉపాధ్యక్షులుగా మానుకొండ ఏడుకొండలు, సహాయ కార్యదర్శిగా శెట్టి నాగమణిని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పల్లి జార్జి బాబు, దిద్దే యేసేబు, గొల్ల పెద్దిరాజు, మల్లుల శ్రీరాములు, పితాని నాగేశ్వరరావు, గూడూరి నాగేశ్వరరావు, సత్యనారాయణ, బుంగ శంకరుడు, కేతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేయాలని తోకతిప్ప వంతెనపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ యనమదుర్రు డ్రెయిన్‌పై తోకతిప్ప, గొల్లవానితిప్ప, భీమవరం కెజిఆర్ కాలేజీ సమీపంలో మూడు వంతెనలు నిర్మించి పది సంవత్సరాలవుతుందన్నారు. అప్పటి నుంచి అప్రోచ్ రోడ్లు వేయకపోవడం వల్ల అత్యవసరాల నిమిత్తం వాహనదారులు ఈ వంతెనల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో తోకతిప్పలో ట్రాక్టర్‌తో వెళ్తూ తిరగబడి మృతి చెందారని గుర్తు చేశారు. దీనిపై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడం పాలకుల చిత్తశుద్ధిలేమికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకుండా, ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణం చేయడానికి అప్రోచ్ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఇంజేటి శ్రీనివాసరావు, రేవు రామకృష్ణ, బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీలకు రుణాలందించాలి

మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో అర్హులైన మత్స్యకార సొసైటీలకు బిసి ఫైనాన్స్ కోఆపరేటివ్ ద్వారా రుణాలందించాలని మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు విన్నవించారు. గురువారం అమరావతిలో రాష్ట్ర బిసి కోఆపరేటివ్ ఫైనాన్స్ ఎమ్‌డీ డాక్టర్ ఎం.మల్లిఖార్జున్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 70 నుంచి 80 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. వేటాడిన సంపదను నిల్వ చేసుకునేందుకు స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, వాహనాలు, ఇతర సామాగ్రికి రుణాలు అందించాలని కోరారు. ఆదరణ-3 పథకం ద్వారా అత్యధిక నిధుల్ని ఈ సొసైటీలకు కేటాయించాలన్నారు.

ఆక్వా రైతులకు అదనపు ఖర్చు

చెరువులో నిరంతరాయంగా తిరుగుతున్న ఏరియేటర్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉదయం 35 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. సాయంత్రం జోరున వర్షం కురుస్తుంది. కొన్ని రోజులుగా ఇదే విధానం కొనసాగడంతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. చెరువు నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడంతో ప్రతిరోజు రూ.వేలాది వెచ్చించి ఏరియేటర్లను తిప్పుతున్నారు. ఎకరానికి రోజుకు రూ.1000 నుండి 2 వేల వరకు అదనపు ఖర్చు అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ చెరువుల్లో రొయ్యలకు తెగుళ్ల సోకడం, ధరలు తగ్గడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి వాతావరణ పరిస్థితులు కూడా తోడవ్వడంతో తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులో తిరుగుతున్న ఏరియేటర్

ఘనంగా జాతీయ సేవా పథకం ఆవిర్భావ సభ

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం స్వర్ణాంధ్ర కాలేజీలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవకు ప్రతిరూపం అని, సేవ ద్వారానే విద్య అనేది సార్థకం అవుతుందని చెప్పారు. కళాశాల కోశాధికారి కె.వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ నేటి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లే రేపటి భవిష్యత్తు కాబోయే నాయకులని చెప్పారు. కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ నేటి యువత దేశానికి వెన్నెముకని, ఎన్ఎస్ఎస్ సేవ ద్వారా యువత దృఢంగా తయారవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్కి, కాలేజీకి ఎన్నో సంవత్సరాలుగా అత్యున్నత సేవలందిస్తున్న బోధనేతర సిబ్బందిని సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ కార్యక్రమాల్లో, అకడమిక్ కార్యక్రమాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టివిబి.ప్రసాద్, ఎస్.శ్రీధరవర్మ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపిచంద్, ఎస్హెచ్ విభాగాధిపతి వి.సామినాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ విశ్వమాణిక్యాలరావు, ఎవి.కృష్ణమోహన్, వివిధ విభాగాధిపతులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


సిబ్బందిని సత్కరిస్తున్న యాజమాన్యం

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ

పాలకొల్లు : విద్యార్థులకు నిజ జీవితంలో ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పాలకొల్లు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.ప్రసాద్‌కుమార్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు వృత్తి నైపుణ్య విద్యలో భాగంగా బిఎఫ్ఎస్ఐ ట్రేడ్‌కు సంబంధించి ఏపిఎస్ఐ కింద సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గురువారం ఇంటర్న్‌షిప్ శిక్షణ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఈనెల 22న ప్రారంభమైన ఈ ఆచరణాత్మక శిక్షణ అక్టోబర్ 1 వరకు కొనసాగుతుంది. బ్యాంకులో జరిగే అన్ని కార్యకలాపాలను బ్యాంకు అధికారుల ద్వారా శిక్షణ పొంది, కస్టమర్లకు బ్యాంకు సేవలను విద్యార్థులు అందిస్తారు. దీని ద్వారా విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు మెరుగుపడి వృద్ధి చెందుతాయని ఇంటర్న్‌షిప్ అనేది ప్రధాన భూమిక పోషిస్తుందని పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.గన్ని లక్ష్మి బాయ్ తెలిపారు. ఇంటర్న్‌షిప్ 10 రోజులు బిఎఫ్ఎస్ఐ ట్రేడ్‌కి చెందిన ఒకేషనల్ ట్రైనర్ వి.పుష్పమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలపై రైతులకు అవగాహన

పెనుమంట్ర : ధాన్యం కొనుగోళ్లు, ఇ-పంట నమోదు ప్రక్రియల పట్ల కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను రైతులు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బి.దేవి స్వరూప అన్నారు. గురువారం ఉదయం, సాయంత్రం మండలంలోని కొయ్యేటిపాడు, భట్ల మగుటూరు, సత్యవరం, పొలమూరు, మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఆయా పరిధిల్లోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ కెఎస్ రాజు కళాశాల విజయోత్సవ ర్యాలీ

పెనుగొండ : స్థానిక ఎస్‌వికెపి అండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) 50 సంవత్సరాలు ముగించుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా విజయోత్సవ వేడుకలు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కళాశాల అధ్యక్షులు పద్మా దాది నాగిరెడ్డి ప్రారంభించారు. గురువారం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జరుగనున్న స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నామని, దానిలో భాగంగా 1600 మంది విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీని పెనుగొండ మెయిన్ రోడ్డు, జల్లావారి వీధి గుండా కళాశాలకు చేరేటట్లు చేసామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఐ అప్పారావు అన్నారు. స్వర్ణోత్సవాలలో భాగంగా పూర్వపు విద్యార్థులను సమకూర్చి వారి ద్వారా కళాశాలకు, గ్రామానికి విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతామని ప్రిన్సిపల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు విభాగాధిపతి రంకిరెడ్డి రామ్మోహనరావు, మార్టేరు గ్రామానికి చెందిన ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ కళాకారులు, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, కళాశాల పూర్వ విద్యార్థి సుబ్రహ్మణ్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ఉండి రైల్వే గేటు

ఉండి: గత వారం రోజులుగా రైల్వే ఫ్లైఓవర్ పనులలో భాగంగా ఉండి రైల్వే గేట్‌ను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఫ్లైఓవర్ పైన గడ్డర్ బిగింపు పనులు పూర్తి చేసుకోవడంతో రాత్రి సమయంలో రైల్వే గేట్‌ను తెరిచారు. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న మైక్రో వాటర్ ఫిల్టర్లు

ఉండి : సుమారు పది లక్షల అంచనా వ్యయంతో జలజీవన్ మిషన్ పథకంలో ఏర్పాటు చేస్తున్న మైక్రో వాటర్ ఫిల్టర్లు అక్టోబర్ 2 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయని మండలంలోని చిన్నపుల్లేరు గ్రామ సర్పంచి భర్త, మూడో వార్డు సభ్యులు పెన్మెత్స రామరాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమ గ్రామానికి కేటాయించిన జలజీవన్ మిషన్ పథకాన్ని నిలుపుదల చేశారని, కానీ ఇటీవల స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజును కలిసి తమ గ్రామంలో తాగునీటి సమస్య గురించి వివరించగా సానుకూలంగా స్పందించిన ఆయన సుమారు రూ.పది లక్షల జలజీవన్ మిషన్ పథకంలో కేటాయించి మైక్రో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మైక్రో వాటర్ ఫిల్టర్ల ద్వారా గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగు జలాలను అందించడం జరుగుతుందని, తమ గ్రామ మంచినీటి సమస్యను తీర్చిన కనుమూరి రఘురామకృష్ణరాజుకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

రణభేరికి తరలిన యుటిఎఫ్ నేతలు

మొగల్తూరు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార నిమిత్తం యుటిఎఫ్ గుంటూరులో నిర్వహించిన రణభేరికి మండల నాయకులు గురువారం తరలి వెళ్లారు. విద్యాశాఖలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించడం, ప్రభుత్వం తీసుకుంటున్న వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని పలువురు నాయకులు తెలిపారు. రణభేరికి తరలి వెళ్లిన వారిలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చింతపల్లి కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాస్, కెఎన్.గంగరాజు, బి.మీనాక్షి, బి.దుర్గాంబిక ఉన్నారు.

పర్యాటకాభివృద్ధికి సహకరించాలి : ఆర్‌డిఒ

మొగల్తూరు : తీరంలో పర్యాటక అభివృద్ధికి సహకరించాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. మండలంలోని పేరుపాలెం సౌత్‌లో గురువారం తహశీల్దార్ కె.రాజకిషోర్ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తిరుమల విజయలక్ష్మి నరసింహ, మేళం బన్ను, వనమాల శీను, పెనిపోతు దుర్గారావు, తిరుమన శ్రీను, సత్తినేని బాబ్జి, పొన్నమండ రాంబాబు, పెనిపోతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీకి పరామర్శ

పాలకొల్లు : పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జీ కుమారుడు డాక్టర్ అంజిబాబు ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర శెట్టిబలిజ విభాగ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్ పాలకొల్లులోని వారి స్వగృహానికి చేసుకుని డాక్టర్ బాబ్జీని, వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య, తదితర పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

భీమవరం బజార్ బ్రాంచి మేనేజర్ డిఎస్.సంజయ్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేసి లాభాల బాటలో నడిపించేందుకు కృషిచేయాలని భీమవరం బజార్ బ్రాంచి మేనేజర్ డిఎస్.సంజయ్ సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ సమావేశాన్ని సొసైటీ ఛైర్మన్ దండు ప్రణవ మూర్తిరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సొసైటీ సిఇఒ యిబ్బా శ్రీనివాస్ మహాజన సభ చర్చనీయాంశాలను చదివి వినిపించారు. సొసైటీ సిఇఒ యిబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు 5 లక్షల చొప్పున మల్టీ పర్పస్ సిసి రుణాలు 14 శాతం ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు నేస్తం రుణాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎకరానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం వాయిదాల పద్ధతిలో రూ.10 లక్షలు 13 శాతానికి రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గోల్డ్ లోన్ సౌకర్యం ఉందని, వాణిజ్య బ్యాంకులకు దీటుగా గ్రాముకి రూ.7 వేల చొప్పున ఇస్తూ 12 శాతం రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో భీమవరం బ్రాంచి సూపర్‌వైజర్ ప్రవీణ, సొసైటీ డైరెక్టర్లు తాడి రామకృష్ణ, గండికోట నరసింహమూర్తి, రైతు సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహాజన సభలో మాట్లాడుతున్న మేనేజర్ సంజయ్

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అందించే అనేక రకాలైన సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని భీమవరం బజార్ బ్రాంచి మేనేజర్ డిఎస్.సంజయ్ అన్నారు. గురువారం కాళ్లకూరు సహకార సంఘంలో నాబార్డ్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ డిజిటల్ బ్యాంకింగ్‌పై కన్స్యూమర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్‌కి ఆవశ్యకత, వాటిని వినియోగించుటలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మోసాల గురించి వివరించారు. ఈ సమావేశంలో భీమవరం బజార్ బ్రాంచి సూపర్‌వైజర్ ప్రవీణ, సొసైటీ అధ్యక్షులు దండు ప్రణవ మూర్తి రాజు, సిఇఒ ఇబ్బ శ్రీనివాస్, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పనిగంటల పెంపు బిల్లు ఉపసంహరించుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన ప్రయివేటు గొడౌన్ల వద్ద నిరసన

ప్రజాశక్తి - పెంటపాడు

రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంటపాడు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో పనిగంటల పెంపును నిరసిస్తూ పత్తిపాడు ప్రయివేట్ గోడౌన్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాని ఉద్దేశించి రంగారావు, పుల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను నూటికి నూరు శాతం సమర్థిస్తూ రాష్ట్రంలోని కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేస్తోందని వారు విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ మార్చి కార్మికులను బానిసలుగా చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే మన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో కార్మికులు రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేసే నిబంధనను మార్పు చేసి 13 గంటలు పనిచేయాలని బిల్లును ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. ఈ బిల్లు అమలైతే కార్మికులు తిరిగి కట్టుబానిసల్లా మారే పరిస్థితికి నెట్టబడతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, లంకలపల్లి అప్పారావు, గెళ్ల పాపారావు, వడ్డాది సన్నాసిరావు, కొమ్మూరి గోపి, జక్కంపూడి బంగారాజు, జక్కంపూడి పెంటారావు, రెడ్డి పోల్ నాయుడు, చల్లా సతీష్, మజ్జి సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్థసారధి

అర్హులైన రైతులకు రుణ మంజూరు

లక్ష్మణేశ్వరం సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్థసారథి

ప్రజాశక్తి - నరసాపురం

అర్హత కలిగిన రైతులకు నిబంధనల మేరకు ఒక ఎకరాకు రూ. పది లక్షల వరకు గరిష్ఠంగా రుణం మంజూరు చేయనున్నట్లు లక్ష్మణేశ్వరం సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్థసారథి తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం పిఎసిఎస్ సొసైటీ ఆవరణలో జరిగిన మహాజన సభ పార్థసారథి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అంచనా బడ్జెట్ రూపొందించుట, డిపాజిట్లపై అత్యధిక వడ్డీ, ఎకరాకు అత్యధికంగా రూ.పది లక్షల వరకు రుణ మంజూరు, ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చులు ఆమోదం తదితర అంశాల ఆమోదంపై తీర్మానం చేశారు. ఈ మహాజన సభ సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు దొంగ రామలక్ష్మి, గుండుబోయిన సూర్యనారాయణ, సొసైటీ కార్యదర్శి ముదునూరి సత్యనారాయణ రాజు, అకౌండెంట్ దాసరి శ్రీనివాస్, రైతులు పరసా మురళీకృష్ణ, మేడిచర్ల కృష్ణారావు, ముత్యాల హరినాథ్, బాల శ్రీనివాస్ ఉన్నారు.

రేపు మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సెల్ సాధారణ సమావేశం ఈనెల 27 శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సెల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సెల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు మండల నూతన కమిటీని గురువారం ఎంపిక చేశారు. కన్వీనర్‌గా కంచర్ల సత్యనారాయణ మూర్తి(సోనీ), కో కన్వీనర్‌గా జి.పెద్దింట్లు, సభ్యులుగా రంగశెట్టి అర్జున్ రావు, కె.బేబీరాణి, ఎ.సీతారత్నం, కడలి ముత్యాలరావు, అడ్డాల ఏడుకొండలు తదితర 19 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన కమిటీ శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు ఆయా కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన 2వ సెమిస్టర్ ఫలితాల్లో పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉత్తమ ఫలితాల సాధనలో ఛాంబర్స్ కళాశాల మొదట ఉంటుందన్నారు. ఈ విధంగా 9.0 నుండి 9.7 మధ్యలో గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు 64 మందని తెలిపారు. వీరిలో 03 మందికి 9.7, 10 మందికి 9.5, 09 మందికి 9.6, 16 మందికి 9.5, 20 మందికి 9.1 సాధించారు. కళాశాలలో అత్యుత్తమ బోధనా ప్రమాణాలు కొనసాగిస్తూ ఆధునిక, సాంకేతిక విధానాలలో విద్యార్థులను తీర్చుదిద్దుటలోనూ, నూతన విద్యా విధానం-2020 సక్రమంగా నిర్వహించుటలో కళాశాల ముందంజలో ఉందని ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, సెక్రెటరీ కెవి.సీతారామరాజు, అకాడమిక్ అడ్వైజర్స్ ఎబిఎన్.మూర్తి, నందుల సీతారామరావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ముదురుతున్న చినపుల్లేరు మంచినీటి చెరువు వివాదం

తప్పు లేకుంటే ఇప్పుడే చర్యలెందుకు..?

సర్పంచిని నిలదీస్తున్న పలువురు గ్రామస్తులు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చిన్నపుల్లేరు గ్రామంలోని మంచినీటి చెరువులోకి మురుగునీరు చేరుతోందన్న వివాదం మరింత ముదురుతోంది. గత మూడు రోజుల క్రితం ఈ సమస్యపై పత్రికల్లో వార్తలు రావడంతో, గ్రామ ప్రెసిడెంట్ ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇచ్చారు. అయితే ఆ వివరణపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. సర్పంచిను సూటి ప్రశ్నలతో నిలదీస్తున్నారు. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని మంచినీటి చెరువులోకి మురుగునీరు వెళ్తోందని వచ్చిన ఆరోపణలపై గ్రామ సర్పంచి భర్త స్పందిస్తూ 'మా ఇంటి నుంచి మురుగునీరు చెరువులోకి వెళ్లడం లేదు. కేవలం వాటర్ ట్యాంకు, సంపు శుభ్రం చేసినప్పుడు మాత్రమే ఆ నీరు బయటకు వస్తుంది' అని వివరణ ఇవ్వడంతో పలువురు గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తూ 'పత్రికల్లో వార్తలు వచ్చిన తర్వాతే మీ ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఎందుకు తవ్వుతున్నారు? ఇన్నాళ్లు లేనిది ఆ డ్రెయినేజీకి ఇప్పుడు హఠాత్తుగా అడ్డుకట్ట ఎందుకు వేశారు?' అని ప్రశ్నించారు. మీ వైపు ఎలాంటి తప్పు లేకపోతే, సమస్యను కప్పిపుచ్చేందుకు ఇప్పుడు ఈ పనులు ఎందుకు చేస్తున్నారు? ఎప్పటినుంచో ఉన్న డ్రెయినేజీని ఇప్పుడే ఎందుకు అడ్డుకోవాల్సి వచ్చింది? అని గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ పరిణామంతో గ్రామంలోని వాతావరణం వేడెక్కింది. వార్తలు వచ్చిన తర్వాతే దిద్దుబాటు చర్యలు చేపట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచి బొర్రా సువర్ణ రాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు బుద్ధరాజు శ్రీనివాసరాజు, పెద్దపుల్లేరు రూరల్ బ్యాంక్ డైరెక్టర్ దేనబోయిన గంగరాజు, గుడ్ల బలరాముడు, తానింకి శివరామకృష్ణ, భలే మాణిక్యాలరావు ఉన్నారు.

పలుచోట్ల స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సిలో గురువారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 275 మంది మహిళలకు వైద్యపరీక్షలు జరిపి మందులు అందజేసినట్లు గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.కిరణ్మయి చెప్పారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ వచ్చేనెల రెండవ తేదీ వరకు ప్రతీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లు సుఖసంతోషాలతో ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి మహిళ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గణపవరం సర్పంచి మూరా అలంకారం, సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, కూటమి నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం: స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యర్రంశెట్టివారి పాలెం పంచాయతీ పితానిమెరక హోమియోపతి ఆసుపత్రిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యాన ఆయుర్వేదం, హోమియోపతి వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగ ముత్యమాంబబాబులు ముఖ్య అతిథులుగా హాజరై, మందులు వాడటం వల్ల స్త్రీలు, పురుషులు, పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధుల నుండి ఉపశమనం లభిస్తుందని, తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఈ ఆసుపత్రికి ఇతర గ్రామాలు, జిల్లాల నుండి కూడా రోగులు రావడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ గిరీష్, హోమియోపతి వైద్యులు డాక్టర్ శాస్త్రి అఖిల రోగులను పరీక్షించి తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ ఎర్రంశెట్టి బాబులు, ఉప సర్పంచి శ్రీదేవి, వాసు, మెడికల్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆచంట : మహిళలు ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేస్తే అనేక రుగ్మతలు దారితీస్తాయని సామూహిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.అనూష అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆచంట సామూహిక ఆరోగ్య కేంద్రం నేతృత్వంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రజాప్రతినిధులు, స్థానిక కూటమి నాయకులు ప్రారంభించారు. ప్రధానంగా నైపుణ్యం కలిగిన 15 విభాగాలకు చెందిన వైద్యులు, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎముకలు కీళ్ల, సైకియాట్రీ, చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి, కంటి, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ సర్జన్, దంత వైద్యులు, ఆయుష్ వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఆరోగ్య పరిరక్షణ అవసరం అనేది అందరూ తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలని ఆలమూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వి.అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని భట్లమగుటూరు గ్రామంలోని ఆలమూరు(భట్లమగుటూరు) పిహెచ్‌సి ఆధ్వర్యంలో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరంలో మహిళలు, కౌమార బాలికలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. ఈ శిబిరంలో 195 మందికి స్క్రీనింగ్, బిపి, షుగర్, కేన్సర్ స్క్రీనింగ్‌తో పాటు డాక్టర్ అమృతరత్న (గైనకాలజిస్ట్) ఆధ్వర్యంలో గర్భిణులకు చెకప్, సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కర్రి వెంకట నారాయణరెడ్డి(వాసు), భట్లమగుటూరు గ్రామ ఉపసర్పంచి లక్ష్మీపతి రాజు, టిడిపి అధ్యక్షులు జంగం చిట్టిబాబు, జనసేన అధ్యక్షులు బయ్యే బాలాజీ, బిజెపి అధ్యక్షులు పేర్రాజు గంటా శ్రీను, జక్కంశెట్టి రామకృష్ణ, కూటమి నాయకులు, గ్రామ పంచాయతీ, సిబ్బంది, వెలుగు సిబ్బంది, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



గణపవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్త్ క్లబ్

పాలకొల్లు : నేటి యువత జీవన శైలి ఆరోగ్యకరంగా మార్చుకొని ఎటువంటి భవిష్యత్ సమస్యలు రాకుండా జాగ్రత్తపడి, మంచి భవితను భావితరాల వారికి అందించాలని పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్యాబ్ టెక్నీషియన్ లెక్చరర్ బి.ప్రేమజ్యోతి పేర్కొన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులతో కలసి హెల్త్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం హెల్త్ క్లబ్ ఏర్పాటుకు ఎంతో దోహదపడుతుందని సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ వికె.మల్లేశ్వరరావు అన్నారు. నేటి టీనేజ్ బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, ఆ సమస్యలకు పరిష్కార మార్గాలు అనే అంశంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. వక్తలుగా కళాశాల అధ్యాపకులు బి.శ్రీలక్ష్మి, వెబిఎల్ కిషోరి పాల్గొన్నారు. అనంతరం ముఖ్య వక్త బి.ప్రేమ జ్యోతికి తోటి మహిళా అధ్యాపకులచే చిరు సన్మానం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ ఎఎస్ఎస్.రమణ కుమార్ నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

ముద్దాయికి రిమాండ్

మొగల్తూరు : బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కోణాల జాన్ బాబును డిఎస్‌పి జి.శ్రీవేద గురువారం అరెస్టు చేశారని ఎస్ఐ జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల బాలికపై జాన్‌బాబు ఈనెల 24న అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ఆ బాలిక కుటుంబ సభ్యులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పాలకొల్లు : మండలంలోని పూలపల్లి గ్రామంలో వివాహిత తోట ఝాన్సీ (33) అనుమానస్పదంగా మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఆమె భర్త పెద్దిరాజు ఆమెను కొట్టి చంపాడంటూ ఝాన్సీ బంధువులు ఆరోపిస్తున్నారు. రాత్రి భార్య భర్తల మధ్య గొడవ జరిగితే ఝాన్సీ బంధువులకు తెలియపరచకుండా ఉదయం ఉరి వేసుకుని చనిపోయిందని భర్త తరపు బంధువులు అంటున్నారని ఆరోపిస్తున్నారు. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. పాలకొల్లు ప్రభుత్వ హాస్పటల్‌లో శవ పంచానామా నిమిత్తం మార్చురీకి తరలించారు. పాలకొల్లు పట్టణ సిఐ రజినీకుమార్, ఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

పెనుమంట్ర : మండలంలోని ఆలమూరు-భట్లమగుటూరు రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇరువురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బ్రాహ్మణ చెరువు నుండి ఆలమూరుకు ఆటో వస్తుండగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఆటో రాడ్ యువకుని పొత్తు కడుపులో దిగిపోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఈ ప్రమాదంలో పెనుగొండకు చెందిన ప్రదీప్, ఆలమూరుకు చెందిన హేమ సుందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్ కుమార్ సంఘటన స్థలానికి చేరి అత్యవసర వాహనం 108 లో క్షత గాత్రుని వైద్య సేవల నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి ఇఎంటి సత్యనారాయణ తరలించారు. పెనుమంట్ర ఎస్ఐ స్వామి ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

CHANGE OF NAME

I, **ANUDEEPIKA GORRE**, D/o **GORRE NARESH KUMAR**, residing at D.No. 3-119, Ambala cheruvu gattu, Kaza east, Yelamanchili Mandal, W.G Dt, A.P, 534260 changed my name **ANUDEEPIKA ANISETTI** D/o **ANISETTI RAMA CHANDRA RAO, ANISETTI SUBHAVATHI** to **ANUDEEPIKA GOREE** D/o **GORRE NARESH KUMAR, GORRE SUBHAVATHI**. Henceforth, all my documents, passport etc. will be continued with my new name and my current parents names as **ANUDEEPIKA GORRE** D/o **NARESH KUMAR GORRE, SUBHAVATHI GORRE**.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నర్సాపురం వారి కోర్టులో,

Creditor I.P.No. 14/2025

బిట్వీన్:
దొడ్డా లక్ష్మీనారాయణ, S/o. సూర్యచంద్రరావు, బిజినెస్, లయన్స్ నగర్, పాలకొల్లు రూరల్, పాలకొల్లు, ప॥గో॥జిల్లా. ...పిటీషనర్

అండ్

1. పోతుల స్వాతి నాగ హనుమావతి, W/o. లేట్ వెంకట సత్యనారాయణ, డోర్ నెం. 1-62, వరిధనం గ్రామం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
2. పోతుల రమ్య లక్ష్మీ ప్రహర్ష, D/o. లేట్ వెంకట సత్యనారాయణ, మైనర్, డోర్ నెం.1-62, వరిధనం గ్రామం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
3. పోతుల వైశావ్య, D/o. లేట్ వెంకట సత్యనారాయణ, మైనర్, డోర్ నెం.1-62, వరిధనం గ్రామం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
4. సాధనాల వెంకటలక్ష్మి, W/o. రామారావు, డోర్ నెం.1-192/4, గాయత్రీ నగర్, మొగలికుదురు గ్రామం, మామిడికుదురు మండలం, Dr. బి.ఆర్. అంబేద్కర్ జిల్లా.
5. The Official Receiver, West Godavari District, Eluru ...రెస్పాండెంట్లు

పై నెంబరు గ్రంధములో పిటీషనర్ వద్ద లేటు వెంకట సత్యనారాయణ గారు ప్రోనోటు బకాయి ఉన్నందున, అతను చనిపోయిన కారణం చేత అయన చేసిన ప్రోనోటు బకాయిని ఏక వేయాలని ఉద్దేశ్యంతో అతని భార్య అయిన 1వ రెస్పాండెంట్, అతని కుమార్తెలు అయిన 2 & 3 రెస్పాండెంట్స్, 4 రెస్పాండెంటుతో కలిసి **ది. 28-01-2025** రెండు నామమాత్రపు దస్తావేజులు నెం. **788/2025. 789/2025** లను సృష్టించినారు. ఆ దస్తావేజును రద్దు పరచాలని పిటీషనరు కోర్టులో పిటిషను దాఖలు చేసినందున యీ విషయాన్ని ఈ ప్రకటన ద్వారా తెలియచేస్తున్నాము.

వాయిదా: 07-10-2025

నర్సాపురం
Date: 25-09-2025

D. Subrahmanyem
Advocate, Palakol
Cell: 98491 73674